అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 05 జూన్ 2023
1

కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జన్నారం

నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనాల ప్రారంభోత్సవానికి వస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జన్నారం మండల అధ్యక్షుడు. గుర్రం రాజారాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్,, పీఏసీఎస్ చైర్మన్ నాసాని రాజన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, తపాలాపూర్ సర్పంచ్ సైనాల తిరుపతి, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న, జిల్లా నాయకులు భరత్ కుమార్ రాజు, రమేష్ గౌడ్ చిందం చంద్రయ్య శ్రీనివాస్ మల్లయ్య, మల్క లక్ష్మణ్, బీవీఎస్ నాయక్, వెంకటస్వామి, లక్ష్మణ్, నరసగౌడ్ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలి నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కాగజ్‌నగర్‌కు చెందిన గుళ్లపెల్లి లావణ్యను నియమించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి కేటాయించడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళా సాధికారత కోసం, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర మహిళా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

నిర్మల్ జిల్లాకు కేసీఆర్ వరాల జల్లు

- 396 గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యే నిధులు
- ప్రతి పంచాయతీకి రూ.10 లక్షలు
- మండల కేంద్రాలకు రూ.20 లక్షలు
- మూడు మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు
- నిర్మల్ సమీకృత కలెక్టరేట్, తెలంగాణ భవనం ప్రారంభించిన సీఎం కేసీఆర్

నవతెలంగాణ-నిర్మల్, దిలావర్‌పూర్



నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ జిల్లాను మరింత అభివృద్ధి పరుస్తామని వరాల జల్లు కురిపించారు. కొత్తగా రూ. కోట్లాది నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రాకరణ్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. మంత్రి కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, పార్టీ పథాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల జిల్లాకు సంబంధించిన ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖ్ర(కె) గ్రామ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లను సీఎం అభినందించారు. అనంతరం బంగాల్‌పేట్, ఎల్లంపల్లి సమీపంలో గల 15 ఎకరాలలో రూ.56 కోట్లతో నిర్మించిన సమీకత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించారు. పూజా కార్యక్రమాలను నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం క్రషర్ రోడ్ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

త్వరలో జిల్లాకు ప్రత్యేక నిధులు

జిల్లాలోని 396 గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు త్వరలోనే ప్రత్యేక నిధులు కేటాయిస్తామని తెలిపారు. ప్రతి పంచాయతీకి రూ.10 లక్షలు, మండల కేంద్రాల అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయిస్తానని హామి ఇచ్చారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున అభివృద్ధి పనులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పది పరీక్షల్లో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో అభినందనలు తెలిపారు. బాసర ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. అడవుల జిల్లా అయినా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాలుగు జిల్లాలుగా ఏర్పాటు అయిందని ఎన్నో అభివృద్ధి పనులు





జరుగుతున్నాయని, అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. కాళేశ్వరం ద్వారా 27, 28 ప్యాకేజీ పనులు పూర్తిచేసి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 196 గోండు గూడలు, లంబాడి తాండలను అభివృద్ధి చేశామని తెలిపారు. యాదవులకు రెండవ విడత గొర్రెల పంపిణీ చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలో సైతం బీఆర్ఎస్‌కు మంచి ఆదరణ ఉందని అక్కడి ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలను అక్కడ కూడా అమలు అవ్వాలని కోరుకుంటున్నారని తెలిపారు. మైనార్టీ సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి విన్నపం మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంజనీర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంతో పాటు జిల్లాలో మిషన్ భగీరథతో నీటి కొరత తీరిందని అన్నారు. ధరణి ఏర్పాటు చేయడంతో రైతులకు తక్కువ సమయంలోనే రిజిస్ట్రేషన్ పనులు జరుగుతున్నాయని, కానీ కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీల్లో ధరణిపై అపోహలు, నిందలు వేస్తున్నారని విమర్శించారు. గతంలో రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓ పట్వారి వ్యవస్థ ఉండడంతో అవినీతి అక్రమాలు జరిగేవని, కాంగ్రెస్ నాయకులు తిరిగి అదే పద్ధతిని కొనసాగిస్తామని ధరణిని ఎత్తివేస్తామని అనడం హాస్యస్పదం అన్నారు. మనందరం ఐక్యతతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రాకరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఆర్ అండ్ బీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రాథోడ్ బాబురావు, దివాకర్, ఆత్రం సక్కు, జిల్లా పరిషత్ చైర్మన్‌లు విజయలక్ష్మి, కోవా లక్ష్మి, నీటిపారుదల శాఖ చైర్మన్ వేణుగోపాలాచారి, ప్రభుత్వ కార్యనిర్వహణ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ లో ఉత్సాహం

ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. పట్టణ సమీపంలోని ఎల్లపల్లిలో నిర్వహించిన ఈ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. సభకు సీఎం రాకముందు సాయంత్రం 5గంటల సమయంలో వర్షం కురవడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. అక్కడి కుర్చీలను తలపై పెట్టుకొని నిల్చున్నారు. కొద్ది సేపటికి వర్షం తగ్గిపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయింపునకు హామీ ఇవ్వడంతో ప్రజాప్రతినిధులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్నంత సేపు పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. రానున్నది ఎన్నికల సంవత్సరం కావడంతో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభ పూర్తయ్యేవరకు జనాలు అక్కడే ఉండి సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు.



సింగరేణిలో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియాలో జూన్ 5న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంబురాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆ ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మందమర్రి ఏరియా సింగరేణి హై స్కూల్ మైదానంలోని ఏర్పాట్లను డైరెక్టర్ ఎన్ బలరాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మైదానానికి వచ్చే వారి శీతల పానియాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సోమవారం జరగబోయే కార్యక్రమాలకి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు, ప్రజలు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనే విధంగా ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే సాగునీటి దినోత్సవ కార్యక్రమ సభను నిర్వహించే స్థలాన్ని ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టిన ఇరిగేశన్ రంగంలో జరిగిన ప్రగతిని అత్యధిక శాతం నిధులు వెచ్చించి బృహత్తరమైన ప్రాజెక్టులను శరవేగంగా నిర్మించి ఎత్తిపోతల బహులార్థక కాళేశ్వరం ప్రాజెక్టును మూడున్నర ఏండ్ల కాలంలో నిర్మించారని గుర్తు చేశారు. అదేవిధంగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి, అత్యధికంగా చెక్‌డ్యాంలను నిర్మించడం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగిన విషయం సాగునీటి సరఫరా జరుపుతూ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ప్రభుత్వ కృషిని సాగునీటి దినోత్సవం సభలో రైతులకు, ప్రజలకు వివరించడం జరుగుతుందని, ఈ సభకు అందరు తరలిరావాలని కోరారు. అలాగే 8వ తేదీన నిర్వహించే ఊరూరా చెరువుల పండుగ నిర్వహించే స్థలాలను పరిశీలించి వాటికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మండలంలోని ప్రతి ఒక చెరువులో ఈ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, డీఈలు భానుమూర్తి, భద్రయ్య, వెంకటరమణ, తిరుపతి, ఏఈ నవీన్, గిరిధవార్, మొబిన్, ఈఓ కృష్ణమూర్తి ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



నవతెలంగాణ-భీమారం

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ గద్దె రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశల ఉపాధ్యాలతో కలిసి 1, 2వ వార్డుల్లో బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని చేపట్టి కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన, వసతులు కల్పిస్తోందన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి వారి అభ్యున్నతికి తల్లిదండ్రులకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, శ్రీమూర్తి, వార్డు మెంబర్లు నరహరి, మల్లేష్, పాల్గొన్నారు.

సంఘాలతోనే మహిళ ఆర్థికాభివృద్ధి

నవతెలంగాణ-భీమారం

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలంటే సహకార సంఘాలతోనే సధ్యమవుతుందని గొర్రెల మేకల వృత్తిదాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యాదవ సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ్ మహిళలు సంఘటితంతో మహిళా సహకార సంఘాలుగా ఏర్పడినప్పుడే ప్రభుత్వం గుర్తించి అండగా నిలుస్తోందని తెలిపారు. దీంతో ప్రభుత్వం ప్రవేశపేడుతున్న సంక్షేమ పథకాల ద్వారా ఫలాలను అందిపుచ్చుకోచ్చని వివరించారు. సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ ఫలాలను సద్వినియోగం చేసుకోవలన్న దిశగా జిల్లా వ్యాప్తంగా గ్రామాల వారిగా మహిళా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం భీమారం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. మహిళా అధ్యక్షురాలుగా అట్ల కళ, ఉపాధ్యక్షురాలుగా కాల్వ లక్ష్మి, కోశాధికారిగా వేల్పుల స్వప్న, ప్రధాన కార్యదర్శిగా కేశవేణి లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొమ్ము లక్ష్మి, రేషవేణి జ్యోతి, కేశవేణి పార్వతి, కాల్వ బీమక్క, కొమ్ము సంధ్య, సునీత, రాపెల్ల స్వరూప సంఘం నాయకులు బోయిని శ్రీనివాస్ యాదవ్, కేషవేణి సత్యనారాయణ, వేల్పుల చంద్రయ్య, మల్లెత్తుల ప్రశాంత్ వేల్పుల గట్టయ్య మారం రాజం పాల్గొన్నారు.

లంబాడి తాండలో బడి బాట

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితండాలో ఆదివారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీసీ సీడీపీఓ ఉమా దేవి మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యను చెప్పడంతో పాటు ఆట పాటలతో బోదిస్తారని తెలిపారు. కిశోర బాలికలకు రక్తహీనత, పౌష్టికాహారం గురించి మానసికంగా, ఆరోగ్యంగా అభివృద్ధి చెందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, అంగన్వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను పదవి నుంచి తొలగించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శాంతికుమారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. భారత రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు. ఇది స్థానిక ఎస్పీఎం మైదానం నుండి ప్రారంభమై రాజీవ్‌చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని మహిళా రెజ్లర్లు ప్రధానమంత్రి దృష్టికి తీసుకుపోతే కమిటీని నియమించారని, ఈ కమిటీ నివేదిక ఇచ్చినా ఇప్పటి వరకు బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 23 నుండి వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారని, వారం క్రితం ఛలో పార్లమెంట్ కార్యక్రమం చేపడితే వారిని అరెస్ట్ చేశారని అన్నారు. దేశానికి క్రీడారంగంలో పతకాలు తీసుకువచ్చిన క్రీడాకారులకే ఈ పరిస్థితి తలెత్తడం చూస్తుంటే దేశంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రెజ్లర్లు చేసే న్యాయపోరాటానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మధుసూదన్, జిల్లా కార్యదర్శులు మహిపాల్, హారిక, వాకర్స్ అసోషియేషన్ నాయకులు ఎం.సుభాష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చరణ్‌దాస్, తలండి లక్ష్మణ్, నాందేవ్, బాక్సింగ్ అసోషియేషన్ సభ్యులు శేఖర్, గురువేందర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలి



నవతెలంగాణ-కెరమెరి

ఎస్సి వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా జిల్లా ఇన్‌చార్జీ రేగుంట కేశవరావు మాదిగ అన్నారు. శనివారం రాత్రి కెరమెరి మండల కేంద్రంలోని ఎస్సి కాలనీలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ చేపట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 28 సంవత్సరాలుగా మాదిగ ఉప కులాలు ఎంతగానో ఉద్యమిస్తున్నప్పటికి, పాలకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా అధికారంలోకి వచ్చినప్పుడు మరో విధంగా వ్యవహరిస్తూ మాదిగలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని ప్రగల్బాలు పలికిన బీజేపీ అధికారం చేపట్టి 8 సంవత్సరాలు గడుస్తున్న నేటికి ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పక్షంలో రానున్న రోజుల్లో మాదిగలను మోసం చేసిన పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మాదిగలకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కోసం మరో పోరాటం తప్పదన్నారు. ఈ నెల 3 నుండి 12వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగు జిల్లా మహాసభల పర్యటనలో భాగంగా ఈ నెల 6వ తేదీన ఆసిఫాబాద్‌లోని ఎస్ఎం గార్డెన్‌లో నిర్వహించ తలపెట్టిన మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. మహాసభలో వర్గీకరణ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే విధంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేష్, మండల అధ్యక్షులు పొర్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కంబాల వినేష్, గౌరవ అధ్యక్షులు, గోగర్ల, రాజయ్య, ఎం ఎస్పీ నాయకులు గైక్వాడ్ రాంచందర్, మహిళ నాయకురాలు లక్ష్మీ, లలిత, లలిత, తిరుసుల్ల, శంకర్, కంభాల చంద్ర శేఖర్, నరేష్ తిరుసుల్ల, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా వంశీచందర్‌రెడ్డి జన్మదినం

నవతెలంగాణ-జన్నారం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ యూత్ కాంగ్రెస్, మాజీ అధ్యక్షుడు, ఏఐసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీ చల్లా వంశీచందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ముజాఫర్ అలీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం మెచ్చిన జననేతగా తెలంగాణ రాష్ట్రంలో యువకులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అన్న అనగానే నేనున్నా అంటూ భరోసా కల్పించే నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, మండల ప్రధాన కార్యదర్శి ఫసీ ఉల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, మండల ఉపాధ్యక్షుడు అంబడిపెల్లి మహేష్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, పట్టణ అధ్యక్షుడు దుమల్ల రమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు బీనవేని రాజన్న, ఎస్సి సెల్ అధ్యక్షుడు ఇందయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు వసీమ్ పటేల్, సీనియర్ నాయకులు తాటికొండ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు దుమల్ల ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై స్పందించాలి

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు హాల్టింగ్ సమస్యపై ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు స్పందించాలని టీడీపీ పెద్దపెల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆయన చేపట్టిన ఒక రోజు దీక్షకు బీజేపీ, కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్, జనసేన వివిధ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షకి పైగా జనాభా ఉన్న మందమర్రి మండలం లో 40 ఏళ్లుగా ఆగిన రైళ్లు ఇప్పుడు ఎందుకు ఆగడం లేదని ప్రశ్నించారు. చేతగాని ఎంపీ వెంకటేష్ నేత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. సీఎం కేసీఆర్ దత్త పుత్రుడు ఎమ్మెల్యే బాల్క సుమన్ హైదరాబాద్ కే పరిమితం అవుతున్నాడని ప్రజా సమస్యలు పట్టించుకోడని స్టేషన్ రోడ్‌కి కేవలం రోడ్డు వేసి చేతులు దులిపేసుకున్నరని విమర్శించారు. హైదరాబాద్‌కి వెళ్లి ఎమ్మెల్యే ఎంపీలని కలవడానికి బీఆర్ఎస్ నాయకులకు రూ.లక్షల విలువ చేసే కార్లు ఉన్నాయి కనుక వారికి ప్రజల కష్టాలు తెలియవని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి మందమర్రి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జమ్మికుంట, కాజీపేట, వరంగల్ హైదరాబాద్ పోవాలంటే మంచిర్యాలకి బెల్లంపల్లికి పోతే గాని గమ్యం చేరుకునే పరిస్థితి లేదన్నారు. ఒక సామాన్యుడు జమ్మికుంట పోవాలంటే టికెట్ ధర రూ.40 మంచిర్యాలకు, రామకష్టాపూర్‌కు ఆటోకు వెళితే రూ.50 ఒక కుటుంబంలో నలుగురు ఉంటే రూ.200 ఆటోకు ఖర్చు అవుతుందని అన్నారు. సమస్యని ఇప్పటికైనా గుర్తించి వారం రోజుల్లో మందమర్రి రైల్వే స్టేషన్‌లో సింగరేణి, అజ్ని, రామగిరి ప్యాసింజర్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైళ్ళని ఆపాలని లేనియెడల నిరసన నిరాహార దీక్షని త్వరలో ప్రజల మద్దతుతో తీవ్రతరం చేసి బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, పట్టణ అధ్యక్షులు జక్కుల సమ్మయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు ఎండీ షరీఫా, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ చెన్నూర్ ఇన్‌ఛార్జి ముల్కల కనకయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు మోయ్య రాంబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు మాయ రమేష్, పట్టణ ఇన్‌ఛార్జి ముల్కల లక్ష్మీరాజం, జిల్లా నాయకులు వాసాల సంపత్, పట్టణ మహిళ అనంత లక్ష్మి, ఇన్‌ఛార్జి ఆర్.జయ అక్క, పట్టణ ప్రధాన కార్యదర్శి కారం రాజు పాల్గొన్నారు.

టాలెంట్ క్వెస్ట్‌లో ప్రతిభ చాటిన మండల విద్యార్థి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నయీంనగర్, హనుమకొండలో నిర్వహించిన చైతన్య టాలెంట్ క్వెస్ట్‌లో మండలంలోని ఈదులవాడ గ్రామానికి చెందిన దుర్గం సదాశివ్ కుమారుడు సాయి వర్ధన్ ప్రతిభ చాటారు. వివరాల్లోకి వెళ్తే ఈదుల వాడకు చెందిన సైనిక అకాడమీలో చదువుతున్న విద్యార్థి దుర్గం సాయి వర్ధన్ టాలెంట్ క్వెస్ట్ పరీక్షల్లో 2022లో విజయం సాధించి అర్హత సాధించగా, రెండో దశలో రూ.10000 బహుమతి పొందాడు. మూడో దశ ఏప్రిల్ 2023లో సెమీఫైనల్ నిర్వహించగా మొదటి స్థానంలో నిలిచి ఫైనల్ కు ఎంపిక కాగా, ఈ నెల మూడో తేదీన నిర్వహించిన ఫైనల్‌లో అదే డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి రామవత్ పవన్‌తో కలసి విజయం సాధించి రూ.లక్ష బహుమతి పొందారు. ఈ సందర్భంగా సైనిక అకాడమీ డైరెక్టర్ ఎడ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ షేర్ కుమార్‌లు సదరు విద్యార్థిని అభినందించారు. తమ కుమారుడు ఉత్తమ ప్రతిభ కనబరిచి రూ.లక్ష బహుమతి పొందడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఎం సభకు తరలి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



అదిలాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిర్మల్ సీఎం కేసీఆర్ సభకు తరలివెళ్లినట్టు ఎంపీపీ గంద్రత్ రమేష్ తెలిపారు. సీఎం సభలో పాల్గొన్న వారిలో వైస్ ఎంపీపీ జంగుపటేల్, ఎంపీటీసీలు, బిక్కి గంగాధర్, జంగుబాపు, కోఆప్షన్ సభ్యులు షేక్ ఆరిఫ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కిసాన్, ఐటి వినోద్, గంగధర్, బీఆర్ఎస్ నాయకుల కుమ్ర రాజు, శ్రీనివాస్, రాజేశ్వర్, బుచ్చన్న, రతన్ ఉన్నారు.

ఈదురుగాలులతో లేచిపోయిన ఇండ్ల పైకప్పులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఈదురు గాలులతో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు ఒకే సారి రావడంతో ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. దీంతో ప్రజలు బయాందోళనకు గురయ్యారు. మండలంలోని మావల, బట్టిసవర్‌గాంలో బలమైన ఈదురు గాలులు రావడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ ఇంట్లోనే ఉండిపోయారు.

ఐపీఎల్‌ను తలపించేలా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఐపీఎల్‌ను తలపించేలా జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్ ప్రీమియర్ లీగ్ పోటీలను పటాస్కర్, ఐయూబ్ సమక్షంలో నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని డైట్ మైదానంలో జేసీ అకాడమీ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న లీగ్ మ్యాచులు ఆదివారంతో ఫైనల్ దశకు చేరుకున్నాయి. ఫైనల్‌లో జేసీ లాన్సర్ వర్సెస్ జేసీ బ్లూవింగ్ తలపడగా 146 పరుగుల లక్ష్యాన్ని చేదించి, జేసీ లాన్సర్ టీం విజేతగా నిలిచిందని తెలిపారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా స్మిత్ తన ప్రతిభను కనబరిచారని అన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే జోగు రామన్న కప్పులను అందజేశారు. ఇలాంటి వేదికలను ప్రతి ఒక్క క్రీడాకారుడు సద్వినియోగం చేసుకొని క్రీడా ప్రతిభను కనబరిచాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి వేదికల ద్వారా క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ప్రస్తుతం ఐపీఎల్‌కు దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందని, ఇదే రీతిలో పట్టణంలో పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. జోగు ఫౌండేషన్ తరపున ప్రత్యేకంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఇలాంటి వేదికలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో జిల్లా క్రీడాకారులు ఐపీఎల్ వంటి పోటీల్లో పాల్గొనేలా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచే ప్రతి క్రీడాకారుడికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, నాయకులు యూనూస్ అక్బానీ, సాజిదోద్దీన్, కోచ్ గజేంద్ర పటాస్కర్, ఇంద్రనీల్, సునీల్ వాగ్మారే, చంద్‌పాషా, బషీర్, అరుణ్, కిషోర్, రవి జబడే, రాజేష్ మితాల్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణనే లక్ష్యంగా పోరాటం

నవతెలంగాణ-ఇచ్చోడ

ఎస్సీ వర్గీకరణనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరో పోరాటానికి సిద్ధం కాబోతునట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈనెల 6న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు, ఈ సభలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో నిర్మాణంతో పాటు బలోపేతం చేస్తూ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే విధంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తూ ఉద్యమ కార్యచరణలో భాగంగా పలు అంశాలపైన చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ సభ అత్యంత ప్రాధాన్యత కలిగిందని అన్నారు, ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, శ్రేణులు, పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో మహాజన సోషలిస్ట్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ దుభాక సుభాష్, జిల్లా నాయకులు సిరిసిల్ల భూమయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చిట్టి రవి, అధికార ప్రతినిధి సుంకే అనిల్, జన్నారపు సాయి, కుందూరు నరేష్, శ్రీకాంత్ మహేశ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు హామీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని చాంద(టి) గ్రామంలో నూతన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కొరకు ఆదివారం చాంద(టి) యువకులు ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్నను కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే విగ్రహ ఏర్పాటుకు హామినిచ్చారు. అందుకు స్థల పరిశీలనకు స్థలాన్ని ఎంపీటీసీ బిక్కి గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తొందరలోనే భూమిపూజ చేసి విగ్రహ ప్రతిష్టపన చేస్తామని తెలిపారు. అదే విధంగా భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ యువజన సంఘం అభివృద్ధి కోసం తనవంతు సాయంగా రూ.5వేల సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంద(టి) ఎంపీటీసీ శ్రీనివాస్ బొడగారి, సుదర్శన్ యూత్ అధ్యక్షులు పోతరాజు, శ్రీకాంత్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ నోట ముక్రా (కె)మాట

నవతెలంగాణ-ఇచ్చోడ

నిర్మల్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ముక్రా(కె) అభివృద్ధిపై మాట్లాడారు. ముక్రా (కె) గ్రామాభివృద్ధిలో దేశంలో నెంబర్ వన్‌లో దూసుకెళ్లిందని అన్నారు. ప్రతి గ్రామంలో ఆనాడు పరిస్థితులు వేరని అన్నారు. ఇప్పుడు ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇంతటితో ఆగకుండా మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముక్రా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్‌ను అభినందించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తేజాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన సర్పే దేవిదాస్(55) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ప్రజా సమస్యలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



నవతెలంగాణ-సిరికొండ

ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఉట్నూర్ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నాయకురాలు రాథోడ్ చారులత అన్నారు. ఆదివారం మండలంలోని ఫకీర్ నాయక్ తండ గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండ దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నాటకమడుతోందని అన్నారు. అనేక మంది చేసిన ఉద్యమ ఫలితంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మను నమ్మించి కేసీఆర్ మోసం చేశారని అన్నారు. రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు గడిచిన నిరుపేద గిరిజనులకు న్యాయం జరగలేదని అన్నారు. విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్యలతో యువత సతమతమవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని తప్పుడు మాటలు చెప్పి మోడీ మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వేస్తే సిలిండర్‌ను రూ.500కే అందజేస్తామని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇమామ్, మైనారిటీ చైర్మెన్ రంజాన్, ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, గంగాధర్, సతీష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ఉట్నూర్



అపూర్వం ఆ కలయిక 20సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరి సందడి చేశారు. ఆదివారం శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల 2002-03 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం పాత ఉట్నూర్ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన రంగయ్యతో పాటుగా అప్పటి ప్రధానచార్యులు కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సాయంత్రం 5 గంటల వరకు సాగింది. తోటి విద్యార్థులు, స్నేహితులతో సమ్మేళనం సందడిగా మారింది. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చదువుకునే సమయంలో అల్లరి, ఆటలు, పాటలను తలుచుకున్నారు. అప్పుడు చదువుకున్న ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంతో వారి ఆత్మ శాంతి కలగాలని మౌనం పాటించి, కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని వేదికపై ప్రకటించారు. పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించేందుకు గత 5 నెలల నుండి ప్రణాళికలు తయారు చేసి అప్పుడు చదువుకున్న విద్యార్థుల ఫోన్ నెంబర్‌లు, ఉపాధ్యాయులు ఫోన్ నెంబర్లు తెలుసుకొని అందరికీ అనువైన రోజును ఎంపిక చేసి ఏర్పాటు చేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. సాంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే శిశు మందిరాలకు పూర్వ వైభవాన్ని కోల్పోవడం అత్యంత భాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చదువునే సమయంలో గురువుల భోదనలతోనే ఈ స్థాయిలో ఉన్నామని అందరి అభిప్రాయలను వేదికపై తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు మళ్లీ కొన్నేండ్ల తర్వాత నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల కమిటీని ఒక సంస్థగా ఏర్పాటు చేస్తామని శిశు మందిర్ పాఠశాలలకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే విధంగా తగు కార్యాచరణకతో ముందుకు వెళతామని విద్యార్థులు తెలిపారు. అనంతరం పలువురు అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు తమని గుర్తుపెట్టుకొని పిలవడం ఆనందంగా ఉందన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణానికి చెందిన విశ్వశాంతి గురుకుల పాఠశాల కరస్పాండెంట్ గడపాలి సుభాష్ పలువురు ఇంటర్ విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించి, తన ఉదార స్వభావాన్ని చాటుకున్నాడు. పెంబి మండలంలోని గుమ్మిన యంగ్లాపూర్ గ్రామానికి చెందిన కొలమ్ విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఇంటి వద్ద ఉంటున్నారు. వారికి సరైన రవాణా సౌకర్యాలు లేక పైచదువులకు వెళ్లలేక మానుకుందామని నిర్ణయించుకున్న విద్యార్థుల ఇండ్లలోకి ఆదివారం వెళ్లి వారికి చదువుపై ఉన్న ప్రాధాన్యతను వివరించారు. అంతేకాకుండా వారికి తన పాఠశాలలో ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ఖానాపూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించినట్లయితే మీకు ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం, ఎలాంటి అడ్మిషన్ ఫీజు లేకుండా కళాశాలలో చేరవచ్చని తెలిపారు. అక్కడ ఉన్నటువంటి పదిమంది విద్యార్థిని విద్యార్థులకు ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాడు. ఈ పదిమంది విద్యార్థిని విద్యార్థులకు తన స్వంత డబ్బులతో ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు గడిపాలి సుభాష్ తెలిపారు. విద్యార్థులకు విద్యార్థులకు ఉచిత హాస్టల్ కల్పించిన సుభాష్ ను స్థానికులు పలువురు అభినందించారు.

మైనార్టీ రిజర్వేషన్ పేరుతో మోసం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్



రిజర్వేషన్ పేరుతో మైనార్టీలను సీఎం కేసీఆర్ మోసం చేస్తూ వస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మొమిన్ పుర కాలానికి చెందిన 50 మంది మైనార్టీ యువకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారిని బొజ్జు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, మాయమాటలు చెప్పి మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్‌తోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజలందరికి న్యాయం జరగాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఓటు బ్యాంకు కోసమే ముస్లింలకు రిజర్వేషన్ 12 శాతం పెంచుతామని అన్నారే, తప్ప అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ముస్లింలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. కేసీఆర్ మాయమాటలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ఓటర్లే తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్, మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖయ్యుం, షేక్ హైమద్, నిసార్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జైవంత్ రావు ఉన్నారు.

సీఎం కప్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనబరిచి సత్తా చాటారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నితిన్ కుమార్, మహమ్మద్ మాలిక్‌లు బాక్సింగ్‌లో పతకాలను సాధించడంతో జిల్లా ఒలంపిక అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి వారిని అభినందించారు. ఈ మేరకు బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన నితిన్ కుమార్, బ్రాన్స్ మెడల్ సాధించిన మహమ్మద్ మాలిక్‌లను గోవర్ధన్‌రెడ్డి ఆదిలాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం అభినందించారు. ఈ మేరకు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన నితిన్ కుమార్, మమ్మద్ మాలిక్‌లు గతంలో సైతం ఎస్‌జీఎఫ్ నేషనల్ గేమ్స్‌లో సైతం పతకాలు సాధించారని గుర్తు చేశారు. పతకాలు సాధించడంతో పాటు జిల్లా ఖ్యాతిని చాటి చెప్పిన క్రీడాకారుల ప్రతిభ అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా ఈ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో బాక్సింగ్ కోచ్ ఆనంద్ భాస్కర్ పాత్ర చాలా కీలకమని అన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆదర్శప్రాయుడు



నవతెలంగాణ-నార్నూర్

ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆదర్శప్రాయుడని హైద్రాబాద్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఆదివారం తాడిహత్నూర్ గ్రామంలో నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని కాజల్ హిందుస్తానీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడని ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో పయనించాలని అన్నారు. ముందుగా హిందూ వాహిని సభ్యులు హస్నాపూర్ క్రాస్ రోడ్డుపై నుండి బైక్ ర్యాలీతో నృత్యాలు చేస్తూ వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, ఆసిఫాబాద్ బీజేపీ పార్టీ ఇన్‌చార్జి అత్మరాం నాయక్, రితేష్ రాథోడ్, ఉపసర్పంచ్ విష్ణు ఫడ్, విశాల్, సంతోష్ బీజేపీ పార్టీ కార్యకర్తలు, హిందూ వాహిని సభ్యులు ఉన్నారు.

ఘనంగా దుర్గం శేఖర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి తినిపించారు. తన పుట్టిన రోజు సందర్భంగా ప్రకాష్ అంబేద్కర్ సభకు రూ.లక్ష విరాళాన్ని అందిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గం ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో సామజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని సూచించారు. ఈ సందర్భంగా దుర్గం శేఖర్ మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా ఈనెల ఆరో తేదిన జిల్లాకేంద్రంలో జరగనున్న ప్రకాష్ అంబేద్కర్ బహిరంగ సభకు తన మాతృమూర్తి దుర్గం చిన్నుబాయి జ్ఞాపకార్థం ట్రస్ట్ తరపున రూ.లక్ష విరాళాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా సభ నిర్వాహకులకు విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

సీఎం సభకు బయలుదేరిన నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ప్రారంభానికి వస్తున్న సీఎం కేసీఆర్ సభకు ఆదివారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి బీఆర్ఎస్ నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మాడల్‌గా నిలుస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో అందించిన అవార్డులే అందుకు నిదర్శనమని అన్నారు. సీఎం కేసీఆర్ సభకు బయలుదేరిన వారిలో ఎంపీపీ గంద్రత్ రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌత్ మనోహర్, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అలాల్ అజయ్, అష్రఫ్, నాయకులు సాజిదోద్దీన్, సతీష్ పవార్, ప్రమోద్‌రెడ్డి, స్వరూపరాణి, బొడగం మమత, పర్వీన్, బియ్యాల అనసూయ ఉన్నారు.

ఘనంగా తెలంగాణ సాహిత్య దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ అస్తిత్వం, సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా కవులు, సాహిత్య వేత్తలను ప్రోత్సహించేలా ఈ నెల 11న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2గంటలకు సాహిత్య దినోత్సవ కవి సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, గోండి, కొలాం, లంబాడీ భాషా కవులు 10 పంక్తులు మించకుండా తమ కవితలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 7వ తేది సాయంత్రం 5గంటల లోపు జిల్లా యువజన సర్వీసుల శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఉత్తమ పద్య, వచన కవితలకు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందని, ఇతర వివరాలకు 9381303380, 9440843848 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

వర్షాలు సమృద్ధిగా కురువాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్ నగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం కాలానికి చెందిన మహిళలు నిర్వహించిన బోనాల పండుగ రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుహాసినిరెడ్డి కాలనీ యువతులు, మహిళలు, చిన్నారులతో కలిసి అమ్మవారికి ముందుగా పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించి, సల్లంగా చూడాలని వేడుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సావర్‌ఖేడ్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తు జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ప్రధానోపాధ్యాయులు కడెర్ల రంగయ్యను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సురక్ష దివస్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా పేద విద్యార్థులకు విద్యాబోధన అందిస్తూ విద్యాభివృద్ధికి పాటు పడుతున్న రంగయ్య ఉపాధ్యాయ లోకానికి ఆదర్శ ప్రాయులని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో సావర్‌ఖేడ్ గ్రామానికి పేరు గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి, కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎస్పీ సురేష్ కుమార్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, అదనపు కలెక్టర్ రాజేశం, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హజ్ యాత్రకు అసిఫాబాద్ నుండి వెళ్లే హజ్ యాత్రికులు మీర్ సబీర్ అలీ హష్మీ, మహమ్మద్ హారున్ జుల్ఫిఖర్‌లను ఎంఐఎం ఆసిఫాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సన్మాన అనంతరం ఎంఐఎం అధ్యక్షుడు ఎండి సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన హజ్ యాత్ర అని, హజ్ యాత్రకు అదృష్టవంతులకే అవకాశం వస్తుందని అన్నారు. భారత దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, దేశ ప్రజలు ప్రేమ అనురాగాలతో ఉండాలని అల్లా ను ప్రత్యేకంగా ప్రార్థించాలని యాత్రికులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి కశిఫ్ హష్మీ, కార్యదర్శి షేక్ అరిఫ్, కోశాధికారి మొహమ్మద్ సభ్యులు సమీర్, సాయి, షాహబాజ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్ సింగ్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాదులో సీఐటీయూ ఆధ్వర్యంలో రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బీజేపీ నాయకుడు రెజ్లర్ల సంఘం చైర్మన్ బ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మ దహనం చేసిన నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ భవన్‌లో తాగు నీటి సమస్య పరిష్కారం

నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీ భవన్‌లో బోరు వేయుటకు ఎమ్మెల్యే ఆత్రం సక్కు గతంలో హామీ ఇచ్చిన మేరకు ఆదివారం ఎంపీపీ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి బోరు పనులను ప్రారంభించారు. ఆదివాసీ భవన్‌లో తాగు నీటి సమస్యను తీర్చడంతో ఆదివాసీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ధర్ము, చిన్ను, జగన్నాథ్‌రావు, దందు, భీంరావు పాల్గొన్నారు.

కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో షర్బత్ పంపిణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన వేడుకల్లో కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో షర్బత్ పంపిణి చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఉబెద్ బిన్ యహీయ(తారిక్), చునార్కర్ శ్రీకాంత్, కట్కుర్ భీంరావు, అబ్దుల్ అకీబ్, ఇర్ఫాన్ బిన్ ఇమాద్, ఆదిల్ బాష్కీఫ్ పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. పల్లంగూడ గ్రామంలో శకుంతల అనే మహిళ ఇల్లు పైకప్పు గాలులతో కూడిన వర్షానికి కూలిపోయింది.

ట్రాక్టర్‌ను సొంత అవసరాలకు ఉపయోగిస్తున్న సర్పంచ్ భర్త

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ట్రాలీ, వాటర్‌ట్యాంకర్‌ను కొనుగోలు చేయించిన విషయం తెలిసిందే. దీనిని సర్పంచ్‌లు తన సొంత అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. సిర్పూర్ మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భర్త సంతోష్ తన సొంత చేనులో తన తండ్రి విగ్రహాన్ని నిర్మించడానికి గ్రామ పంచాయతీకి సంబంధించిన వాటర్‌ట్యాంకర్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఇట్టి విషయంపై సర్పంచ్ భర్తను, గ్రామ పంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా మా ఇష్టం ఉన్నట్టు ఉపయోగించుకుంటామని, ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోమని దురుసుగా మాట్లాడారు. ఈ విషయంపై ఎంపీడీఓ రాజేశ్వర్‌ను వివరణ కోరగా గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌ను గ్రామాభివృద్ధి కోసం వాడుకోవాలే తప్పా సొంత పనుల కోసం వాడుకోవద్దని, ఇట్టి విషయంపై సంబంధిత సర్పంచ్ భర్తను, సెక్రటరీని అడుగుతానని ఆయన తెలిపారు. ఇదే విషయమై డీఎల్‌పీఓ సురేష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

పోలీసుల కమ్యూనిటీ కార్యక్రమాలు అభినందనీయం

- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్
- జిల్లా కేంద్రంలో ఘనంగా సురక్ష దివస్ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ప్రజలతో మమేకమై పోలీసులు చేస్తున్న కమ్యూనిటీ కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ సురేష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సురక్ష దివస్ వేడుకలకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ముందుగా పోలీసులు గౌరవం అందరం స్వీకరించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏడు విభాగాలకు సంబంధించిన స్టాల్స్ పరిశీలించారు. అనంతరం జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల కమ్యూనిటీ కార్యక్రమాలను బుల్లితెరపై ప్రదర్శింపజేసి, పోలీస్ హీరోస్ పేరుతో వివిధ విభాగాల్లో ఉత్తమంగా పనిచేసిన ప్రజలకు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నుండి వివేకానందచౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలీసులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ కార్యక్రమాలు ఎంతగానో అభినందనీయం అన్నారు. వలు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంతోపాటు పేద గిరిజనులకు అవసరమైన వస్తువులు అందజేయడం మెచ్చుకోదగినదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత సీఎం కేసీఆర్ పోలీస్ శాఖలో చాలా మార్పులు తీసుకువచ్చారని అన్నారు. జిల్లాలో అత్యున్నత ప్రమాణాలతో కొత్త పోలీస్ స్టేషన్‌లు, సర్కిల్ ఆఫీసులు, జిల్లా పోలీస్ కార్యాలయాలు నిర్మించడం ద్వారా పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ప్రభుత్వం సాధించిన కృషి ప్రగతిలో అందరూ భాగస్వామ్యం అవుతామని అన్నారు. సురక్ష దివస్ కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేసిన పోలీస్ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనక యాదవరావు, డీఎస్పీ శ్రీనివాస్, కరుణాకర్, ఎంపీపీ మల్లికార్జున్, జెడ్పీటీసీలు కోవా అరుణ, అజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మెన్ మల్లేష్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ ఉన్నారు.



ఈదురు గాలులతో కార్యకర్తలకు ఇబ్బందులు



నవతెలంగాణ-నిర్మల్, దిలావర్‌పూర్

సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా క్రషర్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో మరికొద్ది నిమిషాలలో సభ ప్రారంభం కాబోతుండగా ఈదురుగాలులు, తేలికపాటి వర్షం కురిసింది. దీంతో సభ ప్రాంగణం చుట్టూ కట్టిన భారీ ఫ్లెక్సీలు, భారికేడ్లు నేలకొరిగాయి. అలాగే కురిసిన వర్షానికి కార్యకర్తలు ఇబ్బందులకు గురయ్యారు. కుర్చీలనే తలపై గొడుగుల పట్టుకొని కేసీఆర్ రాక కొరకు వేచి చూశారు. అనంతరం ఈదురుగాలుతో కూడిన వర్షం తగ్గడంతో సీఎం కేసీఆర్ సభకు విచ్చేసి 15 నిమిషాలు జిల్లాకు సంబంధించిన అభివృద్ధి పనుల గురించి ప్రసంగించారు.

పంట రుణమాఫీపై ప్రకటన చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ పంట రుణ మాఫీపై స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ రైతు సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు కొండగొర్ల లింగన్న కోరారు. ఆదివారం పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి కొంతవరకు అమలు చేసిందన్నారు. అయితే రూ.లక్ష వరకు పంట రుణా మాఫీ పూర్తిగా అమలు కాలేదని, మరో ఐదు నెలలు ఎన్నికలు వస్తాయన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో రుణమాఫీ ప్రకటన వెంటనే చేయాలన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి వస్తున్న సీఎం కేసీఆర్ పంట రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేసి రైతులలో భరోసానింపాలని ఆయన కోరారు.

వ్యవసాయ అధికారుల విస్తృత తనిఖీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని విత్తన దుకాణాలను, గోడౌన్లను జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య ఆదివారం తన బృందంతో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు తనిఖీల్లో భాగంగా రిజిస్టర్ బిల్లు బుక్‌లను, వారికి వివిధ కంపెనీల నుంచి వచ్చిన విత్తన నిల్వలు, అమ్మకం గురించి ఆరా తీశారు. రైతులకు బిల్లులను పూర్తి వివరాలతో లాట్ నెంబర్, రైతు వివరాలు, సంతకంతో ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్టాకు వివరాలను ప్రతిరోజు బోర్డుపైన రాయాలని సూచించారు. డిమాండ్ ఉన్న పత్తి రకం, ఇతర కంపెనీల విత్తరకము వివరాలను ఆరా తీశారు. స్థానికంగా డిమాండ్ కలిగిన పత్తి రకాలు ఎటువంటి షరతులు లేకుండా జిల్లా రైతులకు మాత్రమే విక్రయించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల రైతులకు స్థానికంగా డిమాండ్ ఉన్న విత్తనాలను అమ్మ రాదని హెచ్చరించారు. ప్రతి నెల తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో విత్తన నిల్వలు, అమ్మకం వివరాలను ఫామ్-డి లో నమోదు చేయాలని సూచించారు. విత్తన నమూనాలను తీసి విత్తన నాణ్యత ప్రమాణాల కొరకు ల్యాబ్‌కు పంపించారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారి డి.పుల్లయ్యతో పాటు సహాయ సంచాలకులు ఎస్.రమేష్, టెక్నికల్ వ్యవసాయ అధికారి కే. శివకుమార్, భగత్ రమేష్ కుమార్ ఉన్నారు.



కల్వర్ట్ నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఈదులవడా గ్రామ పంచాయితీ పరిధిలోని గొల్లగూడా గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్ట్ నిర్మాణ పనులను ఆదివారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ గ్రామస్తులతో కలసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్ట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని అన్నారు. ఇది పూర్తి అయితే ఈదులవడా, కొమ్ముగూడా, తెనుగూడా, గొల్లగూడా గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భీమేష్, గ్రామస్తులు ప్రభాకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లాకు సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా కడెం మండల ప్రతిపక్ష పార్టీల నాయకులను ముందస్తు శనివారం రాత్రి 9 గంటలకు అక్రమంగా అరెస్టు చేశారని ప్రతిపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అక్రమ అరెస్టు చేయడం నియంతృత్వ ధోరణి అవలంబిస్తున్నారని అన్నారు. ఖానాపూర్ బహిరంగ సభలో ఖానాపూర్‌లో రెవెన్యూ డివిజన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తాని చేయలేదని అన్నారు. ఇప్పటికి కార్యాచరణ లేదని అన్నారు. గిరిజనులు, గిరిజనేతరులకు పోడు భూములకు పట్టాలు, లక్ష రూపాయల రుణమాఫీ, కడెం వరదలతో రైతుల భూములను కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించలేదని అన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించలేక పోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, శుత్తశుద్ధి లేదని అన్నారు. అన్నివర్గాల ప్రజలను మాటలతో మోసం చేస్తూన్నారని పేర్కొన్నారు. వెంటనే ఇచ్చిన వాగ్దానాలు చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇందులో అరెస్ట్ అయిన వారిలో ప్రతిపక్ష పార్టీల నాయకులు సునారికారి రాజేష్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోళ్ల వెంకటేష్, బీజేపీ మండల అధ్యక్షులు ధర్మాజి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి తలారి రాజేంధర్, మల్లేష్, బబ్లు, బ్రహ్మచారి, రైతు సంఘం అధ్యక్షులు హపవత్ రాజేంధర్, బీజేపీ సీనియర్ నాయకులు రవీంధర్‌గౌడ్, రాజేష్ రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు ఉన్నారు.

నిర్మల్ : సీఎం కేసీఆర్ పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డిని ఆదివారం పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ ఆహ్వానించగా, ఎస్పీ అరెస్టు చేయించడం ఏంటని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం అవడం ఖాయమని హెచ్చరించారు. పోలీసులు తమ తీరు మార్చుకోవాలని సూచించారు. అలాగే సోన్ మండలంతో పాటు ఇతర మండల బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

ఇంద్రవెల్లి : తెలంగాణ సీఎం కేసీఆర్ నిర్మల్ పర్యటనను అడ్డుకుంటామని అనడంతో స్థానిక బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో మరప్ప రాజు, దిలీప్ మోరే, దీపక్ సింగ్ శేఖావత్, ముండే రాజేశ్వర్, రాజ్‌వర్ధన్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. నియంత పాలనకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని అన్నారు.

దిలావర్‌పూర్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టర్ సముదాయ కార్యాలయాన్ని ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ వస్తున్న తరుణంలో మండలానికి చెందిన బీజేపీ నాయకులను కార్యకర్తలను శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కలెక్టర్ భవనాన్ని ప్రారంభం చేయడానికి వస్తున్న కేసీఆర్‌కు బీజేపీ భయం పట్టుకుందని, అందుకోసమే అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు. చేతగాని ప్రభుత్వ డొల్లతనం బయటపడుతుందనే ఉద్యేశంతో అక్రమ అరెస్టులు చేశారని, అక్రమ అరెస్టులు కేసీఆర్ అరాచక పాలనకు సూచిక అని అన్నారు. ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడానికి ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో సర్పంచ్ విరేష్ కుమార్, కోడె ముత్యం, మంద మల్లేష్, సాదుల సుభాష్, గోపు రాకేష్, దాత్రిక విజయ్, ఉద్గిరి సాయినాథ్, జక్కుల మురేష్, కదం సాయినాథ్, పీసరి ప్రవీణ్, పండరీ, స్వాతి ముత్యం ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : నిర్మల్ జిల్లాలో సీఎం కేసీఆర్ ఆదివారం పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా బీజేవైఎం నేతలను ఆదివారం పోలీసులు తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాళ్లబండి మహేందర్‌ను మావల పోలీసులు అరెస్ట్ చేయగా, నిఖిల్ దురిశెట్టి, కటకం రాజేందర్ లను ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ తో సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో వీరిని ముందస్తు అరెస్టు చేశారు.

బాసర : సీఎం కేసీఆర్ పర్యటనను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా ఆదివారం తెల్లవారుజామున మండల పరిధిలోని బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్ మాట్లాడుతూ అకారణంగా తమని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, శాంతియుత పోరాటాల ద్వారానే ప్రజల సమస్యలపై పోరాడుతామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సాయినాథ్ పాల్గొన్నారు.



కడెంలో...



నిర్మల్‌లో...



ఇంద్రవెల్లిలో...



దిలావర్‌పూర్‌లో...



ఆదిలాబాద్‌టౌన్‌లో...